



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 316 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 18 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :316 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 18 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

- తాను చెప్పే ఐదు మొక్కల పేర్లు చెప్పాలని లోకేశ్ కి సవాల్
- పేర్లు చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- కూటమి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదని ఆయన ఎద్దేవా చేశారు. అంతేకాదు తాను చూపించే ఏవైనా ఐదు వ్యవసాయ

- మిగతా 2లో






## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్య

- హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది... అదే నాలో కసిని పెంచింది: మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్
- మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
- 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
- అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తామని, పెట్టుబడులు ఆకర్షిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:"హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది"

- మిగతా 2లో



### యుద్ధం కొనసాగుతున్నా..

## భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రుతుపవనాల ముప్పును ప్రస్తావించిన ఆర్‌బీఐ గవర్నర్
- అయినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని మల్హోత్రా ధీమా
- రూపాయి పరిస్థితి సహజమేనని వివరణ
- వాణిజ్య ఒప్పందాలు ఎగుమతులకు ఊతమిస్తాయని భరోసా
- రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం పరిధిలోనే ఉందని వెల్లడి

- మిగతా 2లో

### అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు

## టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి



### మంత్రి నారాయణ డెడ్‌లైన్!

- అమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం పార్కులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్న ప్రభుత్వం
- అమరావతిలో రోడ్లు, భవనాలు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్టులు పూర్తి కావాలన్న నారాయణ
- పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కేవలం పరిపాలనా నగరంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు

- మిగతా 2లో

## జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కయింది

- పట్టిసీమను జగన్ వట్టిసీమ అన్నారన్న దేవినేని ఉమా
- జగన్ అధికారంలోకి వచ్చాక అదే పట్టిసీమ ద్వారా నీరు ఇవ్వాల్సి వచ్చిందని ఎద్దేవా
- పులివెందులకు కూడా చంద్రబాబు నీరు ఇచ్చారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:గంగా-కావేరి నదుల అనుసంధానంపై డాక్టర్ కేఎల్ రావు కలగన్నారని... ఆ స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు గోదావరి-కృష్ణ నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా సాకారం చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమా వెల్లడించారు. గతంలో జగన్ పట్టిసీమను 'వట్టిసీమ' అని విమర్శించారని... ఆయన పాలనలో అదే పట్టిసీమ ద్వారా

- మిగతా 2లో





## గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

### నరసరావుపేటలో సీఎం చంద్రబాబు


- గత పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
- వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం
- 2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి

- మిగతా 2లో





## త్వరలోనే ఫడ్నవీస్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు

- త్వరలోనే మోదీ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న సంజయ్ రౌత్
- ఫడ్నవీస్‌కు కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు ఇస్తారని జోస్యం
- మహారాష్ట్రకు బీజేపీకి చెందిన మరోనేత సీఎం అవుతారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి దుమారం రేపేలా శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) వర్గం ఫైర్‌బ్రాండ్ ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ త్వరలోనే తన పదవికి రాజీనామా

- మిగతా 2లో

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రయోగానికి ఆర్బీఐ శ్రీకారం!
- మొదటగా రూ. 10, రూ. వ20 డినామినేషన్లలో పైలట్ ప్రాజెక్టు
- కాగితం నోట్ల కంటే ఎక్కువ మన్నిక, భద్రత కలిగిన పాలిమర్ నోట్లు
- ప్రస్తుత కాగితం నోట్లు యథావిధిగా చలామణి
- 2027 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చే అవకాశం

పెన్ పవర్ డెస్క్: దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి, 2027 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

- మిగతా 2లో




## మెక్సికోలో భారీ భూకంపం.. 7.3గా నమోదైన తీవ్రత




- మెక్సికో దక్షిణ పసిఫిక్ తీరంలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 7.3గా నమోదైన భూకంప తీవ్రత
- గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వరకు కంపించిన భూమి

పెన్ పవర్ డెస్క్:మెక్సికో దక్షిణ పసిఫిక్ తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గ్వాటెమాలా సరిహద్దుకు సమీపంలో చోటుచేసుకున్న ఈ భూప్రకంపనల ప్రభావం మెక్సికో సిటీతో పాటు ఎల్ సాల్వడార్ వరకు విస్తరించింది. యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 7.3గా నమోదైంది. చియాపాస్ తీరానికి సమీపంలోని అఖిలెస్ సెర్డాన్‌కు నైరుతి దిశగా 48 కిలోమీటర్ల

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## పొత్తులే కత్తులుగా మారతాయా?
## చంద్రబాబుకు అతి పెద్ద ఛాలెంజ్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజమైన ఛాలెంజ్ ను ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదీ ప్రత్యర్థి వైసీపీ నుంచి మాత్రం కాదు. కేవలం సొంత పార్టీలోని నేతల నుంచే. అనేక నియోజకవర్గాల్లో ఇప్పటికే నాయకత్వంలో గ్రూపులుగా విడిపోయి ఉన్నారు. పదవుల కోసం పోరాడి.. పోరాడి రెండేళ్ల నుంచి అలసి పోయి ఉన్నారు. వారందరినీ ఒక చోట చేర్చి అందరినీ మెప్పించి ఒక బాటలో పయనించేలా చేయడం కత్తిమీద మీద సామే అవుతుందని మాత్రం చెప్పాలి. ముఖ్యంగా కూటమి పార్టీలోని మిగిలిన మిత్ర పక్షాలు గెలిచిన స్థానాల్లోనూ ఎవరి మధ్య సఖ్యత లేదు. ఎవరి దారి వారిదే లాగా ఉంది.

**పొత్తులో భాగంగా...**

ఇప్పటికే పొత్తులో భాగంగా ఎమ్మెల్యే సీటును కోల్పోయిన తమకు మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఛైర్మన్ పదవులను ఖచ్చితంగా మిత్ర పక్షాలు గెలిచిన నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ చార్జులు డిమాండ్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే అక్కడ ఉన్న ఎమ్మెల్యే అందుకు ఒప్పుకునే పరిస్థితి ఉంటుందా? అన్నది కూడా అనుమానమే. వార్డు మెంబర్ల నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ స్థానిక నేతల నుంచి చంద్రబాబు ఒత్తిడిని ఎదుర్కొంటారు. ఎమ్మెల్యే సీటు తమకు ఇవ్వకపోయినా తాము కూటమి ధర్మాన్ని పాటించి మద్దతు ఇచ్చి గెలుపులో ముఖ్యపాత్ర వహించినప్పటికీ, గెలిచిన తర్వాత మాత్రం తమను పట్టించుకోవడం లేదని అనేక నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

**పదవుల కోసం ఘర్షణలు...**

ఇటీవల తిరుపతి పట్టణంలో జరిగిన తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గంలోనే ఇన్ ఛార్జి పదవి కోసం నేతల తరుపున కార్యకర్తలు ఘర్షణలకు దిగడాన్ని చూశాం. ఇక స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాజీ పడకపోవచ్చు. వీరందరినీ సముదాయించడం చంద్రబాబుకు ఆషామాషీ కాదు. అలాగని జిల్లా ఇన్ ఛార్జి మంత్రులపై ఈ భారాన్ని మోపితే వారు ఒత్తిడికి గురయి వదిలేస్తారు. నారా లోకేశ్ చేయి వేసినా వారందరినీ ఒక బాటలో పయనించేలా చేయడం కష్టంగానే కనిపిస్తుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు అధికారంలో ఉన్న చంద్రబాబుకు అతి పెద్ద సమస్యగా మారే అవకాశముంది. ఒకవేళ మిత్ర పక్షాలకు ఇచ్చిన చోట ఒకరినొకరు సహకరించుకునే పరిస్థితి ఉండదు. మరి ఈ పరిస్థితి నుంచి పార్టీని ఎలా బయటపడేస్తారన్నది చూడాలి.

## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

- మొదటి పేజి తరువాయి

మొక్కల పేర్లను ఆయన సరిగ్గా చెబితే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కాకాణి సవాల్ విసిరారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం దోపిడీయే పరమావధిగా పాలిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరితే, ప్రస్తుతం చంద్రబాబు వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని కాకాణి దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో నిర్మించిన రామాయపట్నం పోర్టును ఈ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనమని కాకాణి విమర్శించారు. ఈ ప్రభుత్వంలో గ్రావెల్ తవ్వకాల నుంచి నిరుద్యోగుల డీఎస్సీ నోటిఫికేషన్ వరకు ప్రతి ఒక్క విషయంలోనూ అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ప్రతి పథకంలోనూ, ప్రభుత్వ నిర్ణయంలోనూ పారదర్శకత లోపించిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కాకాణి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

## అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి

- మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభు త్వం కసరత్తులు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కృష్ణా నదీ తీరాన 'రివర్ ఫ్రంట్ టూరిజం' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది.అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ఏడీసీఎల్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథితో పాటు పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు.

**ఈ సమీక్షా సమావేశం ముఖ్యాంశాలు:**

పీపీపీ విధానంలో పార్కుల అభివృద్ధి: అమరావతిలో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించేలా భారీ 'అమ్యూజ్‌మెంట్ పార్క్', పర్యావరణాన్ని ప్రతిబింబించేలా 'ఎకో టూరిజం పార్కు'లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ) పద్ధతిలో అభివృద్ధి చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది.

మంత్రి నారాయణ డెడ్‌లైన్: రాజధాని పరిధిలో ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చే సమయానికే.. సమాంతరంగా ఈ పర్యాటక ప్రాజెక్టులన్నీ కూడా పూర్తి కావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సీఎం చంద్రబాబు విజన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా.. దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్ట్ డిజైన్లు ఉండాలని, పనుల్లో వేగం పెంచాలని మంత్రి స్పష్టం చేశారు.రైతులకు, పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా ఇప్పటికే టూరిజం ప్రాజెక్టుల కోసం భూములు తీసుకున్న ఇతర ప్రైవేట్ సంస్థలు కూడా కాలయాపన చేయకుండా తక్షణమే తమ నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. తాజా సమీక్షతో అమరావతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులకు మరింత ఊపు రానుంది.

## త్వరలోనే ఫడ్నవీస్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు

- మొదటి పేజి తరువాయి

చేసి, ఢిల్లీ బాట పట్టబోతున్నారంటూ ఆయన జోస్యం చెప్పారు. రాబోయే ఒకటి లేదా రెండు నెలల్లో కేంద్రంలో మోదీ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని, అదే జరిగితే మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు ఖాయమని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. సీఎం ఫడ్నవీస్‌ను ఢిల్లీకి పిలిపించి కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు అప్పగిస్తారని, ఆయన స్థానంలో బీజేపీకి చెందిన ఒక సీనియర్ నేతను మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. శివసేన (ఖదీు) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న 'రామ రక్షా ఆందోళన్' సన్నాహకాలను పర్యవేక్షించేందుకు నాగ్‌పూర్ వెళ్లిన సంజయ్ రౌత్.. అక్కడి నుంచే ఈ పొలిటికల్ బాంబ్ పేల్చారు.

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (చీూా) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## యుద్ధం కొనసాగుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, బలహీన రుతుపవనాల ముప్పు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగుతోందని చెప్పారు. అయితే అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం వేచి చూసే ధోరణిని అనుసరించాల్సిన అవసరం ఉందని సూచించారు. దూరదర్శన్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇరాన్ యుద్ధం తర్వాత అమెరికా డాలర్ బలపడిందని మల్హోత్రా తెలిపారు. దీంతో అనేక దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయని చెప్పారు. ప్రపంచ పరిస్థితులతో పోలిస్తే రూపాయి విలువలో వచ్చిన మార్పు సహజంగానే ఉందని స్పష్టం చేశారు. రూపాయి పనితీరుపై ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు.భారత విదేశీ వాణిజ్యం బలంగానే కొనసాగుతోందని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. సేవల ఎగుమతులు, విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి వచ్చే నగదు, రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశానికి అండగా నిలుస్తున్నాయని చెప్పారు. బ్రిటన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం, యూరోపియన్ యూనియన్, అమెరికాతో కొనసాగుతున్న చర్చలు కూడా ఎగుమతులకు ఊతమిస్తాయని వివరించారు.సరఫరా సంబంధిత కారణాల వల్లే ఇటీవల ద్రవ్యోల్బణం పెరిగిందని మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం

4 శాతం పరిధిలోనే ఉందని చెప్పారు. ధరల స్థిరత్వంతో పాటు ఆర్థిక వృద్ధి మధ్య సమతుల్యం కాపాడే దిశగా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అందుకే ఈ ఏడాది ఇప్పటివరకు కీలక వడ్డీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించినట్లు పేర్కొన్నారు.అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయని మల్హోత్రా గుర్తుచేశారు. భారత్ తన అవసరాల్లో దాదాపు 88 శాతం ముడి చమురును దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆగస్టు 3 నుంచి 5 వరకు జరిగే ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో తాజా ఆర్థిక పరిస్థితులను సమీక్షించి వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

## గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (చీూా) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని

పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కయింది

- మొదటి పేజి తరువాయి

నీటిని ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యంగ్యంగా అన్నారు. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్ అని చెప్పారు.

పట్టిసీమ, అమరావతి నిర్మాణాల్లో జగన్ అడ్డంకులు సృష్టించి రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అకుంఠిత దీక్షతో మార్చి 2025లో పట్టిసీమ పనులు ప్రారంభించి, సెప్టెంబర్‌లోనే తొలి విడతగా కొంత నీటిని డెల్టాకు నీరందించారని తెలిపారు. పులివెందులకు కూడా చంద్రబాబు నీరు ఇచ్చారని అన్నారు.

పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీరు అందడం వల్ల చౌడు భూములు సారవంతంగా మారి, ఎకరాకు దిగుబడి 50 నుంచి 60 బస్తాలకు

పెరిగిందన్నారు. సాగు నీరు సమృద్ధిగా అందడం వల్ల ఎరువుల ఖర్చు తగ్గి రైతుల ఆదాయం పెరిగిందని, రాయలసీమ నేడు హార్టికల్చర్ రంగంలో అద్భుతాలు చేస్తోందని ఉమా వివరించారు.

## మెక్సికోలో భారీ భూకంపం.. 7.3గా నమోదైన తీవ్రత

- మొదటి పేజి తరువాయి

దూరంలో, భూ అంతర్భాగంలో 15 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ ప్రధాన భూకంపానికి ముందు సముద్ర గర్భంలో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.భూకంప తీవ్రతకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. మెక్సికో, గ్వాటెమాలా సరిహద్దుల్లోని సుచియాటే నగరంలో సునామీ ముప్పు పొంచి ఉందనే అనుమానంతో తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మేయర్ ఎల్మర్ పేర్కొన్నారు. మెక్సికో దక్షిణ సరిహద్దులోని కీలక నగరమైన టపచులాలో తొలుత స్వల్పంగా ప్రారంభమైన ప్రకంపనలు, కొద్దిసేపటికే తీవ్రరూపం దాల్చాయి.

"మేము ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న సమయంలో భూమి కంపించడం మొదలైంది. తొలుత ఇది సాధారణ ప్రకంపనలే అని భావించాం, కానీ తీవ్రత పెరగడంతో అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చేశాం" అని ఓ ఉద్యోగిని అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధికి వివరించారు.

గ్వాటెమాలా సిటీలో భూప్రకంపనలు దీర్ఘకాలం పాటు కొనసాగడంతో జనం ఆందోళన చెందారు. మెక్సికో సిటీలోని పలు ప్రాంతాల్లో భవనాలు ఒక్కసారిగా ఊగిపోయాయి. అయితే, భూకంపం సంభవించిన ప్రారంభ క్షణాల్లో దాని తీవ్రత నిర్దేశిత పరిమితిని మించకపోవడం వల్ల ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ మోగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- మొదటి పేజి తరువాయి

తొలి దశలో భాగంగా రూ. 10, రూ. 20 వంటి తక్కువ ముఖ విలువ కలిగిన నోట్లతో ఈ ప్రయోగాన్ని ప్రారంభించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేయకుండానే, దశలవారీగా ఈ కొత్త పాలిమర్ నోట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన పాలిమర్ షీట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ నోట్ల ముద్రణ విభాగం ఇప్పటికే గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) జారీ చేసింది. బిడ్లు దాఖలుకు ఆగస్టు 18ని తుది గడువుగా నిర్ణయించింది.

దేశంలో యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగినప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గలేదు. దీనికి తోడు పాత నోట్ల స్థానంలో కొత్త వాటిని ముద్రించడం వల్ల ముద్రణా వ్యయం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది. ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, కెనడా వంటి దేశాల్లో ఇవి విజయవంతంగా చలామణిలో ఉన్నాయి.గతంలో 2012-14 మధ్య కాలంలోనే ఆర్బీఐ ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్య

- మొదటి పేజి తరువాయి

అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు.అమరావతి అభివృద్ధిపై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019-24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపోలేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు.ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహ స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, అదానీ అంకా వంటి పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, రాబోయే మూడేళ్లలో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల కోసం అహర్నిశలు కష్టపడతానని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.




# ఫ్రంట్‌లైన్‌లో ప్రాణాలు... చేతికి మాత్రం రూ.710

-హోంగార్డుల చాకిరి

-పోలీసులతో సమానంగా విధులు..

కానీ ప్రభుత్వ ఉద్యోగుల హోదా లేదు

తెలంగాణలో రూ.1000 రోజువేతనం...

ఏపీలో ఇంకా రూ.710కే పరిమితం

టీఏ, డీఏ, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలు లేక ఇబ్బందులు



**బ్యూరో, పెన్ పవర్ -- ప్రకాశం, జూలై 17:**

ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వహించే హోంగార్డుల జీవితాలు కష్టాల నడుమ సాగుతున్నాయి. పోలీసు శాఖకు భుజం తట్టే సహాయక బలగంగా పనిచేస్తూ అన్ని రకాల బందోబస్తుల్లో ముందుండే వీరికి రోజుకు కేవలం రూ.710 గౌరవ వేతనం మాత్రమే అందుతోంది. అదే సమయంలో పొరుగు రాష్ట్రం తెలంగాణలో రోజుకు రూ.1000 వేతనం చెల్లించడమే కాకుండా ట్రాఫిక్ విధులు నిర్వహించే హోంగార్డులకు అదనపు ప్రోత్సాహక భత్యం కూడా ఇస్తుండటంతో ఆంధ్రప్రదేశ్ హోంగార్డులు తమ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పర్యటనలు, ఎన్నికలు, పండుగలు, విపత్తులు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల దర్యాప్తుకు సంబంధించిన బందోబస్తు... ఇలా ప్రతి కీలక సందర్భంలో హోంగార్డుల సేవలు తప్పనిసరిగా ఉంటాయి. పోలీసులతో కలిసి 24 గంటలు విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారికి ప్రభుత్వ ఉద్యోగుల హోదా లేకపోవడంతో అనేక సంక్షేమ ప్రయోజనాలకు దూరమవుతున్నారు.

**డ్యూటీ చేసిన రోజుకే వేతనం..:** హోంగార్డులకు నెలవారీ జీతం కాకుండా రోజువారీ గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారు. విధులకు హాజరైన రోజులకు మాత్రమే రూ.710 చెల్లిస్తారు. సెలవులు లేదా ఇతర కారణాలతో డ్యూటీ చేయకపోతే ఆ రోజు వేతనం కోత పడుతుంది. దీంతో కుటుంబ పోషణ మరింత భారంగా మారుతోంది.

**ఉమ్మడి ప్రకాశంలో వెయ్యి మందికి చేరువలో సిబ్బంది...:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పోలీసు శాఖలో సుమారు 800 మంది హోంగార్డులు, సబ్ జైళ్లు, ఆర్టీసీ తదితర శాఖల్లో మరో 150 నుంచి 200 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణలో వీరి పాత్ర కీలకమైనప్పటికీ, అందుతున్న వేతనం మాత్రం జీవన వ్యయాలకు ఏమాత్రం సరిపోవడం లేదని వారు చెబుతున్నారు.

**ధరలు పెరిగినా... వేతనం మాత్రం అదే...:** పెట్రోల్, డీజిల్, ఇంటి అద్దెలు, కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా హోంగార్డుల గౌరవ వేతనంలో మాత్రం పెరుగుదల కనిపించడం లేదు. ప్రస్తుతం సాధారణ కూలీ పనులకు కూడా రోజుకు వెయ్యి రూపాయల వరకు లభిస్తున్న నేపథ్యంలో ప్రాణాలకు తెగించి పనిచేసే హోంగార్డులకు రూ.710 మాత్రమే ఇవ్వడం అన్యాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**తెలంగాణలో మెరుగైన సౌకర్యాలు...:** తెలంగాణలో హోంగార్డులకు రోజుకు రూ.1000 వేతనం చెల్లించడంతో పాటు ట్రాఫిక్ విధుల్లో ఉన్న వారికి అదనంగా నెలకు రూ.5 వేల ప్రోత్సాహకం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కూడా వేతనాల పెంపు, సంక్షేమ చర్యలపై దృష్టి పెట్టాలని హోంగార్డులు కోరుతున్నారు.

**టీఏ, డీఏలు లేవు... పథకాలు కూడా అందవు....:** హోంగార్డులకు టీఏ, డీఏలు లేవు. ప్రభుత్వ ఉద్యోగుల హోదా లేకపోవడంతో పలు సంక్షేమ పథకాలు కూడా వర్తించడం లేదు. బియ్యం కార్డు, విద్యార్థుల ఫీజు రాయితీలు, ఇతర కుటుంబ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందని పరిస్థితి నెలకొంది. వారి పిల్లల విద్య కూడా ఆర్థిక ఇబ్బందుల మధ్య కొనసాగుతోంది.

**అనారోగ్యానికి ఆర్థిక భారం...:** ఎండలో, వర్షంలో గంటల తరబడి విధులు నిర్వహించడం వల్ల పలువురు హోంగార్డులు షుగర్, బీపీ, గుండె, కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. సరైన ఆరోగ్య భద్రత లేకపోవడంతో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. ఆరోగ్యశ్రీతో పాటు కనీసం రూ.50 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని వారు కోరుతున్నారు.

**లోకేష్ పాదయాత్రలోనూ కీలక సేవలు...:** మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా హోంగార్డులు ఏఆర్ పోలీసులతో కలిసి రోప్ పార్టీగా విధులు నిర్వహించారు. పాదయాత్ర మొత్తం భద్రతలో పాల్గొన్న పలువురు తోపులాటల్లో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందిన సందర్భాలూ ఉన్నాయి. అయినప్పటికీ వారి సేవలకు తగిన గుర్తింపు, భద్రత ఇప్పటికీ దక్కలేదని సహచరులు పేర్కొంటున్నారు.

**ఎస్పి మానవతా దృక్పథానికి ప్రశంసలు...:** జిల్లాలో హోంగార్డులకు ఎలాంటి ఆపద వచ్చినా జిల్లా ఎస్పీ మానవతా దృక్పథంతో స్పందిస్తున్నారని హోంగార్డులు చెబుతున్నారు. మరణం లేదా పదవీ విరమణ వంటి సందర్భాల్లో సహచరుల నుంచి ఒక రోజు వేతనం సేకరించి బాధిత కుటుంబాలకు అందించే విధానం కొంత ఉపశమనం కలిగిస్తోందని వారు తెలిపారు. అయితే ప్రభుత్వం నుంచి లభించే ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలకు మాత్రమే పరిమితమవుతుండటంతో దీర్ఘకాలిక భద్రత అవసరమని అభిప్రాయపడుతున్నారు.

**ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తిలి...:** ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ప్రజల భద్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న హోంగార్డులకు గౌరవ వేతనం పెంచడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సంక్షేమ సదుపాయాలు కల్పించడం, ఆరోగ్య బీమా, ఫీజు రీయింబర్స్‌మెంట్, కుటుంబ సంక్షేమ పథకాలు అమలు చేయాలని హోంగార్డులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. "ప్రాణాలను పణంగా పెట్టి సేవ చేస్తున్న వారికి కనీస జీవన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత" అని పలువురు హోంగార్డులు అభిప్రాయపడుతున్నారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# గ్రీవెన్స్ అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి- కలెక్టర్ రాజాబాబు

## వలేటివారిపాలెం మండలానికి ప్రత్యేక నిధులు ఇవ్వాలి- ఎమ్మెల్యే ఇంటూరి







**వలేటివారిపాలెం, పెన్ పవర్ జూలై 17**

వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, సబ్ కలెక్టర్ హిమవంశీ, డి ఆర్ ఓ వెంకటరమణ, జెడ్పి సీఈవో చిరంజీవి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గంలో నాలుగు చోట్ల ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. చిన్న చిన్న సమస్యలు ఇక్కడే పరిష్కారం చేస్తుండగా, పెద్ద సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నాం. అన్ని శాఖల అధికారులు అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. మీరు ఇచ్చిన అర్జీ, ఏ స్థాయిలో ఉందో వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చునని అన్నారు. ప్రతి సమస్య తప్పక పరిష్కారం అవుతుందని అంతవరకు సమయమనంతో ఉండాలని ప్రజలకు కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈరోజు మొత్తం 340 అర్జీలు వస్తే, అందులో 70 శాతం రెవెన్యూ సమస్యల గురించే ఉన్నాయని గత ప్రభుత్వం చేసిన రిసర్వే కారణంగానే ఆన్లైన్, విస్తీర్ణం నమోదులో భారీగా తప్పులు వచ్చాయన్నారు. వీటిని సరి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. వలేటివారిపాలెం మండలంలో 15 సచివాలయాలు, 21 పంచాయతీలకు గాను 5 మంది మాత్రమే రెగ్యులర్ విఆర్వోలు ఉన్నారు. ఇలాంటప్పుడు సమస్యలు పేరుకుపోవడం సహజమని వెంటనే తగినంత మంది సిబ్బందిని నియమించాలని కలెక్టర్ ని కోరారు. గ్రామాల్లో పొలాలకు వెళ్లే దారులను రోడ్లుగా మార్చాల్సిన అవసరం ఉంది. అనేక చోట్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాలు బాగా వెనుకబడి ప్రాంతాలు కాబట్టి ప్రతిసారి కరువు మండలాల జాబితాలో వీటిని చేరుస్తున్నారు. ఈ రెండు మండలాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్నారు. రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా 130 గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోంది. రిజర్వాయర్ అడుగంటినప్పుడు, నీరు కలుషితంగా మారుతుంది. ఫిల్టర్ బెడ్లు మార్చినా ఉపయోగం ఉండడం లేదు కాబట్టి ప్రస్తుతం కొన్ని గ్రామాలకు రంగు మారిన నీళ్లు వస్తున్నాయని ప్రత్యేక దృష్టి పెట్టి ఈ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. కందుకూరు ప్రాంతానికి భారీ పరిశ్రమలు రాబోతున్నాయని ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చేందుకు అధికారులందరూ సహకరించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, నియోజకవర్గ అధికారులతో పాటు మండల టిడిపి అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ అధ్యక్షుడు కాకుమాని ఆంజనేయులు, క్లస్టర్ ఇంచార్జిలు కాకుమాని హర్ష, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, పార్టీ సీనియర్ నాయకులు పరిటాల భాస్కర్, కొంకా రమేష్, వలేటి మధు, సాధు చెన్నకేశవులు, వలేటి నరసింహం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నిరీక్షణ ఫలించిన రోజు

## విద్యార్థుల బస్సు సౌకర్యం సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జులై 17**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొమరోలు మండలశీ పోసుపల్లి , రెడ్డిచెర్ల మొదలగు గ్రామానికి చెందిన విద్యార్థిని , విద్యార్థులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ని శుక్రవారం కలిసి, మండలంలోని సుదూర గ్రామాల నుండి ఇంటర్ , డిగ్రీ కళాశాలల విద్యార్థులు , కళాశాలకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు సరైన బస్సు సౌకర్యం లేక కళాశాలలకు, పరీక్షలకు సరైన సమయానికి వెళ్లలేక , చదువులో వెనుక వాడుతున్నాం అని ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యను సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వెంటనే సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్ మౌనిక గారి తో మాట్లాడి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు తక్షణ స్పందించి రెండు రోజులలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు ఈ సందర్భంగా విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

అన్ని మతాలను సమానంగా గౌరవిస్తాం

చెప్పిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశాం

వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి జగన్ ప్రజలను మోసం చేశారు

త్వరలో వెలిగొండ నుంచి నీళ్లు అందిస్తాం

మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**మార్కాపురం / త్రిపురాంతకం, జూలై 17 :**

హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం త్రిపురాంతకంలోని శ్రీ బాలత్రిపుర సుందరిదేవి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి డా. స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, మ్యారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య తో కలిసి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆలయ కమిటీ సభ్యుల చేత మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...వైసీపీ హయాంలో హిందూ దేవాలయాల్ని నిర్లక్ష్యం చేశారన్నారు. కాసుల కక్కుర్తితో తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని సైతం కల్తీ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించామని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తామన్నారు. గత ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారన్నారు. నాడు జగన్ వెలిగొండ పూర్తిగా కాకుండానే జాతికి అంకితం చేసి జిల్లా ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వెలిగొండ పనులు యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. త్వరలో వెలిగొండ నుంచి నీళ్లు అందించి ఈ ప్రాంతాన్ని అంతా సస్యశ్యామలం చేస్తామని మంత్రి డా. డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు.





# శ్రీగిరిలో నూతన ఏఎస్పీ యుగంధర్ ప్రత్యేక పూజలు

- వేద ఆశీర్వచనం అందించిన వేద పండితులు అర్చకులు



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 17**

ఒంగోలు నూతన అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పీ) అడ్మిన్ గా నియమితులైన యుగంధర్ శుక్రవారం ఒంగోలులోని శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. తొలుత శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఏఎస్పీ యుగంధర్ కు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలకడంతో పాటు సత్కరించి శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# మాజీ మంత్రి శిద్దా దంపతులను ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్య సంఘం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 17**

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి ని ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ గౌరవ అధ్యక్షురాలుగా నియమించిన సందర్భంగా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో ఒంగోలు వారి నివాస మందు కలిసి ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు రావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు జలదంకి వెంకటకృష్ణారావు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ముప్వల శ్రీనివాసులు, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు మురారిశెట్టి సుధీర్ కుమార్, ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యదర్శి చినగేపల్లి సురేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షులు బైసాని వెంకట సుబ్బారావు, జరుగుమల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోటా కిషోర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసిన గుడ్లూరు సిఐ రమేష్



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 17:**

గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతన బాధ్యతలు స్వీకరించిన డి.రమేష్ శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కందుకూరు ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల కుండీని అందజేశారు. గుడ్లూరు సర్కిల్ పరిధిలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాల పట్ల కఠినంగా వ్యవహరించాలని, హైవేలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజా ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే సూచించారు.

# ఎస్సై వెంకటేశ్వరరెడ్డిని కలిసిన ముత్యాల నారాయణరెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 17**

సి ఎస్ పురం ఎస్ఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన పి వెంకటేశ్వరరెడ్డిని శుక్రవారం వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి అభినందించారు ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.




# నేకునాంపురంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

## -హ్యాండ్ చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం







**వలేటివారిపాలెం పెన్ పవర్, జూలై 17:**

వలేటి వారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నేకునాంపురం గ్రామంలో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో క్షయవ్యాధిని ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్. శివప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు హ్యాండ్ చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి, టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్సపై అవగాహన కల్పించారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ పి. శివరామయ్య, టీబీ సూపర్వైజర్ బి. శ్రీమన్నారాయణ, హెల్త్ సూపర్వైజర్ కె. పద్మావతితో పాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# ఇంటూరి ఇప్పటికైనా నిజాలు చెప్పు...?

-రామయపట్నం పోర్టు ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలి లేదంటే ఎంతటి పోరాటానికైనా వైసీపీ సిద్ధం

-కలిసివచ్చే పార్టీలన్నిటిని ఈ ఉద్యమంలో కలుపుకుంటాం

-ఛలో రామాయపట్నంను విజయవంతం చేయండి -బుర్రా మధుసూదన్ యాదవ్



**కందుకూరు పెన్ పవర్, జూలై 17:**

రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణ విషయంలో ఇంటూరి నాగేశ్వరరావు ఇప్పటికైనా నమ్మి ఓట్లు వేసిన కందుకూరు ప్రజలకు, భూములు ఇచ్చి పోర్టు నిర్మాణానికి సహకరించిన రైతన్నలకు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని నమ్మి మోసపోయిన నిరుద్యోగ యువతకు ఇప్పటికైనా నిజాలు చెప్పాలని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. రామాయపట్నం పోర్ట్ 2022లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసి 95శాతం పూర్తి చేశారు.దాదాపు 850 ఎకరాలలో 3743 కోట్లతో పనులు ప్రారంభిస్తూ భూమి పూజ చేశారు.నాలుగు బెర్తులు నిర్మాణం ద్వారా 25 మిలియన్ టన్నుల కార్గో రవాణా సామర్థ్యంతో ప్రారంభించి రామయపట్నం పోర్టులో 70 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇచ్చే విధంగా చట్టం చేశారు. పోర్ట్ కి అనుసంధానంగా వచ్చే పరిశ్రమలు చుట్టుపక్కల ప్రాంతాల్లో వచ్చే అన్ని ప్రాజెక్టులలో స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తాం అని రామాయపట్నం పోర్టు పూర్తయి వినియోగంలోనికి వస్తే మత్స్యకార కుటుంబాలకు ఉద్యోగ ఉపాధితో పాటు అభివృద్ధి చెందుతాయనే లక్ష్యంతో రామాయపట్నం పోర్ట్ లో ఎంత లేదన్న 4000 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి ఉద్యోగాలతో పాటు పారిశ్రామిక అభివృద్ధి జరిగి లక్షల్లో ఉద్యోగాలు వస్తాయి. పోర్టు నిర్మాణానికి సహకరించిన మొండివానిపాలెం, ఆవులవారి పాలెం, కర్లపాలెం, రావూరు, చేవూరు,సాలిపేట గ్రామాలను అభివృద్ధిలో భాగం చేస్తామనే సంకల్పంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంకల్పించి 5000 కోట్ల రూపాయల విలువైన రామాయపట్నం పోర్టును చంద్రబాబు అత్యంత కారు చౌకగా 1500 కోట్లుకే ప్రైవేటు వ్యక్తులకు ధారాధత్వం చేస్తున్నారు. రామాయపట్నం పోర్టును ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ఏపీ మ్యారిటైమ్ బోర్డు బిడ్లను పిలిచింది. ముందుగా బిడ్ల మొత్తంలో సగం అంటే 750 కోట్లు చెల్లిస్తే చాలు అంటుంది.మిగిలిన 750 కోట్లు వాణిజ్య కార్యకలాపాలు మొదలుపెట్టిన తర్వాత ఇస్తే సరిపోతుంది అని కూటమి ప్రభుత్వం అంటుంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ కృషితో ప్రభుత్వ రంగంలో సృష్టించిన లక్షల కోట్ల విలువైన ఆస్తుల్ని ప్రైవేటుకు తెగ నమ్ముతున్నారు. గత ప్రభుత్వం సమకూర్చిన విలువైన ఆస్తి రామాయపట్నం పోర్టు. గత వైయస్ జగన్ ప్రభుత్వంలో 850 ఎకరాలలో భూమి విలువలతో కలిపి 4929 కోట్లతో అభివృద్ధి చేసింది. కూటమి ప్రభుత్వం 50 ఏళ్ల దీర్ఘకాలానికి ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారు. ఇప్పటికే ఈప్రాజెక్టు కోసం ఏపీ మారిటైమ్ బోర్డు తీసుకున్న 2079 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుంది. కేవలం చంద్రబాబు నాయుడు దురుద్దేశంతో రామాయపట్నం పోర్టు ఎక్కడ పూర్తయితే జగన్ కు మంచి పేరు వస్తుందోనని అన్ని హంగులతో ఉన్న పోర్టును ప్రైవేటు సంస్థలకు అప్పగించడానికి చంద్రబాబు సిద్ధపడ్డాడు. వేలకోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే పోర్టును తన స్వార్ధ బుద్ధితో బలి పెడుతున్నారు అని తీవ్రంగా విమర్శించారు. రామాయపట్నం పోర్టులో ప్రభుత్వం ఈక్విటీ 12 శాతం మాత్రమే.దీనివలన రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి యజమాన్య హక్కులు ఉండవు. సెకండ్ పేజ్ లో పోర్టును అభివృద్ధి చేసేందుకు ఎకరానికి ఏడాదికి ఒక రూపాయి లీజు చాలు అంట. ఈ టెండర్ లోనే తెలిపారు ఇప్పటికే ఈ పోర్టు నందు బిపిసిఎల్ ఒక బెర్తు ను రిజర్వ్ చేసుకున్నది. ఇండోసోల్ పోర్ట్ కు దగ్గరలోనే అతిపెద్ద భారీ సోలార్ ప్యానల్ను తయారీ యూనిట్ ఏర్పాటు చేసింది.పోర్టు పరిధిని తగ్గించి నిర్వహణ విస్తరణ పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తుంది. కూటమి ప్రభుత్వం తీరాన్ని తినుకో, దాచుకో, పంచుకో విధానంతో ముందుకు పోతుంది. పోర్టు నిర్మాణం దాదాపు పూర్తయిన దశలో ప్రైవేటుపరం చేయాల్సిన అవసరం ఏమి వచ్చింది.కూటమి ప్రభుత్వం లోపయికారి ఒప్పందాలు చేసుకుని ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ప్రవేటీకరణ నాటకం ఆడుతుంది.వేలకోట్ల విలువైన ప్రభుత్వ ప్రజల ఆస్తిని ప్రైవేటుపరం చేసేటప్పుడు కనీసం ప్రజాభిప్రాయం కూడా తీసుకోలేకపోయింది. రామాయపట్నం పోర్టు కోసం భూమిని ఇచ్చిన ప్రజలు ఆశలను వారి త్యాగాలను గౌరవిస్తూ పోర్టును ప్రభుత్వ ఆధీనంలోనే పూర్తిచేసి జాతికి అంకితం చేయాలి. ప్రతిపక్షంలో కానీ వైసీపీ పార్టీ అంటున్నావు. మంచిదే మేము ప్రతిపక్షంలో కాదు నుటికి ముమ్మాటికి ప్రజల పక్షం. 90 శాతం పోర్టు పూర్తయింది అన్నది నగ్నసత్యం. రెండు సంవత్సరాలలో జగన్మోహన్ రెడ్డి రామాయపట్నం పోర్టు 90 శాతం పూర్తి చేస్తే. కేవలం బెర్తులు పూర్తి చేయడానికి 20ఏళ్లు కావాలంటున్నావు. గ్లోబల్ బిడ్లు పిలిచామని గొప్ప చెపుతున్నావు అంటే టెండర్ ద్వారా ప్రైవేటుకు అమ్ముతున్నట్లే కదా.పోర్ట్ ను రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో మేము నిర్మిస్తే కమిషన్ల కక్కుర్తి కోసం ఎమ్మెల్యే,ఎంపీలు ప్రైవేటు భాగస్వామ్యానికి ఒప్పుకుంది నిజం కాదా అని నిలదీశారు. పిపిపి అంటే అదేదో దివ్య మంత్రం అన్నట్లు ఎమ్మెల్యే చెప్పడం విడ్డూరంగా ఉంది ప్రైవేటు భాగస్వామ్యం కల్పించి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని భూములు ఇచ్చిన కందుకూరు ప్రాంత రైతులు, ప్రజల ఆకాంక్షలను ప్రైవేటు వారికి అమ్ముతూ సిగ్గు లేకుండా వేలకోట్లు ఖర్చు అవుతున్నందున ప్రైవేటుకు ఇస్తున్నామని గొప్పలుచెప్పుకుంటున్నావు ఇప్పటికైనా వాస్తవాలు ప్రజలకు వివరించి నిజాలు చెప్పు లేకపోతే మునీశ్వరుడు శాపం ఉన్నట్లు నిజం చెప్తే తల వెయ్యి ఒక్కలవుతుంది అని భయపడుతున్నట్లున్నావు అని అన్నారు. ఇప్పటికైనా రామాయపట్నం పోర్టు వాస్తవాలు ప్రజలకు వివరించి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గిట్టుబాటు ధరల లేక అన్ని రకాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సంపద సృష్టి దేవుడేరుగు ఏమో కానీ వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ సంపదలను చంద్రబాబు నాయుడు తెగ నమ్ముతున్నాడని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను కూడా అమ్మ చూపారని విమర్శించారు. ఇన్ని లోసుగులు పెట్టుకుని ఎమ్మెల్యే తాడేపల్లిలో ప్రెస్ మీట్ పెట్టి అంతా బాగుందని భ్రమలో ఉన్నాడు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బయటకు వచ్చి ప్రజల పడుతున్న పాట్లను చూడాలని అన్నారు. మాలకొండ లో జరుగుతున్న అవకతవకలపై పలుమార్లు నేను ప్రశ్నిస్తేనే శిరోజాల విషయంలో బాకీ డబ్బులు కట్టించారని ఈ సందర్భంగా అన్నారు. రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణను నిరసిస్తూ జరుగుతున్న ఛలో రామాయపట్నంను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు, విద్యార్థి,మేధావి,కార్మిక,కర్షక, యువత, మహిళలకు పిలుపునిచ్చారు. ఈ ప్రైవేటీకరణ ఉద్యమంలో కలిసివచ్చే పార్టీలన్నిటిని కలుపుకొని ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా పోరాడుతామని తెలిపారు.పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, జిల్లా సెక్రెటరీ తోకల కొండయ్య,రాష్ట్ర బూత్ జాయింట్ సెక్రెటరీ గణేశం గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్,జిల్లా ఇంటలెక్చువల్ అధ్యక్షులు రావులకొల్లు.బ్రహ్మానందం ,వలేటివారిపాలెం మండల అధ్యక్షులు అనుమోలు లక్ష్మి నరసింహ, ఉలవపాడు మండల అధ్యక్షులు నన్నం పోతురాజు , ఉలవపాడు మండల అధ్యక్షులు కాపులూరి కృష్ణ, లింగసముద్రం మండల అధ్యక్షులు నోటి వెంకటేశ్వర్ రెడ్డి, ఉప్పుటూరి నాగేశ్వరరావు, నల్లమోతు చంద్రమౌళి, బద్దిపూడి జయరావు, వెలిచెర్ల ధన కోటేశ్వరరావు, పాలవల్లి అమర్నాథ్ రెడ్డి, గెరా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన సాహిత్యకారుడు సుందర రాజు

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 17**

కుల అస్తిత్వ చైతన్యాన్ని ప్రకటించుకుంటూనే బహుజనవాదాన్ని వినిపించిన సాహిత్యకారుడు డాక్టర్ నాగప్ప సుందరరాజు అని బహుజన రచయితల వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ నూకతోటి రవికుమార్ పేర్కొన్నారు. సాహిత్యవేత్త సుందర రాజు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ ఆవరణలో గల జాషువా ప్రాంగణంలో బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుందర రాజుకి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సాహిత్య పరిశోధకుడిగా, దళిత సాహిత్య వేత్తగా సుందర రాజు అనితర సాధ్యమైన పాత్రను పోషించాడని, హైదరాబాదు యూనివర్సిటీలో దళిత సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ' గుండె డప్పు' కవితా సంకలనం రావడంలో సుందర రాజు క్రియాశీల పాత్ర నిర్వహించారన్నారు. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా తన ప్రభావాన్ని చాటుకుంటూనే కాలం చేసిన సుందర రాజు



కృషి ఈనాటి సాహిత్యకారులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో డెమోక్రటిక్ జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు గద్దల శివాజీ, కృషి రాష్ట్ర ప్రతినిధి బొడ్డు శ్రీనివాసరావు, జరిచర్ల రమేష్, కిరణ్ కుమార్, జర్నలిస్టులు సాహిత్యకారులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ




**గిద్దలూరు పెన్‌పవర్ జులై 17**

గిద్దలూరు పట్టణంలోని జడ్.పి.హెచ్.ఎస్ ప్లస్ నందు చదువుతున్న 70 మంది విద్యార్థినీలకు ఇదే పాఠశాలలో పీ.జి.టీ లు గా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి. పిచ్చయ్య, మొరసా. బాల గురవయ్య లు తమ సొంత నిధులను నుంచి 15 వేల రూపాయలు ఖర్చు చేసి 70 మంది విద్యార్థినీలకు అవసరమైన నోటుబుక్స్, పెన్నులు తదితర స్టేషనరిని హై స్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు ప్రిన్సిపాల్ సిద్దేశ్వర శర్మ మాట్లాడుతూ విద్యార్థినీలకు జేఈఈ మెయిన్స్, నీట్ కు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. దాతలు డాక్టర్ మొర్రి. పిచ్చయ్య, మైరసా బాల గురువయ్య లు మాట్లాడుతూ విద్యార్థినిలు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోని లక్ష్య సాధన కోసం కష్టపడి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిజిటిల సిబ్బంది సగీర్, శ్రీరామిరెడ్డి, రాజేంద్రప్రసాద్, శోభారాణి, వెంకాయమ్మ పాల్గొని దాతలు మొరసా బాలగురువయ్య, డాక్టర్ మొర్రి. పిచ్చయ్యలను అభినందించగా, విద్యార్థినీలు ధన్యవాదాలు తెలిపారు.

# ఒంగోలులో పొగాకు రైతు దీక్షలో 'పిడతల'




**గిద్దలూరు, పెన్ పవర్ జులై 17**

పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారంనాడు చేపట్టిన పొగాకు రైతు దీక్ష కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. రైతు సంక్షేమానికి,పొగాకు రైతుల గిట్టుబాటు ధరల సాధించడానికి వైఎస్సార్సీపీ ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉందని అన్నారు.ప్రతి రైతుకూ మద్దతు ధర దక్కేలా, వారి హక్కులు కాపాడేలా తమ పోరాటం సాగుతుందన్నారు.

# పొదిలి ఉప ఖజానా ఉద్యోగికి ఘన సన్మానం చేసిన కరిముల్లా బేగ్



**పొదిలి, పెన్ పవర్, జులై 17**

పొదిలి ఉప ఖజానా ఉద్యోగికి ఘన సన్మానం జరిగింది. పొదిలిలోని ఉప ఖజానా కార్యాలయంలో యూడీసీగా పనిచేస్తున్న షేక్ కరీముల్లా పదోన్నతిపై బాపట్ల ఉప ఖజానా అధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని శుక్రవారం నాడు హబీబుల్లా బేగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కరిముల్లా బేగ్ స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో కరీముల్లా ను కలసి శాలువా, పూలదండతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగూర్ వలి, ఎన్జీవోల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

### హెచ్ఎం కు తీవ్ర గాయాలు

### ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్సై వెంకటేశ్వరరెడ్డి





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 17**

మండలంలోని కోవిలంపాడు గ్రామం నందు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దర్శిగుంటపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బైరెడ్డి వెంగలరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు విధులు ముగించుకుని తన స్వగ్రామమైన పామూరుకు కియా కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. మండలంలోని దర్శిగుంటపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న వెంగళరెడ్డి పాఠశాలలో విధులు నిర్వహించిన అనంతరం తన కియా కారులో పామూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో కోవిలంపాడు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా కారు టైరు అకస్మాత్తుగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పింది. దీంతో కారు ముందుగా రహదారి మధ్యలో ఉన్న డివైడర్ ను బలంగా ఢీకొని, అనంతరం సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కారు పల్టీలు కొట్టడంతో పూర్తిగా ధ్వంసమైంది.ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వెంగళరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి ఆయనను చికిత్స నిమిత్తం పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందుతున్నట్లు సమాచారం.ప్రమాద విషయం తెలుసుకున్న సీఎస్పురం ఎస్సై వెంకటేశ్వరరెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గురైన కారు జాతీయ రహదారిపై అడ్డంగా ఉండటంతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సాయంతో కారును రహదారి పక్కకు తరలించారు.

# పశు వైద్యశాల ఏడీగా డాక్టర్ పి సుదర్శన్ రావు నియామకం

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 17**



సి ఎస్ పురం ఏరియా పశు వైద్యశాల ఏడీగా డాక్టర్ పి సుదర్శన్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు ఈయన పదోన్నతి పై ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా నుండి వచ్చారు ఈ సందర్భంగా పశు వైద్య సిబ్బంది కలిసి అభినందించారు.

# కుటుంబ సమేతంగా తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న దామచర్ల జనార్ధన్

### - రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని శ్రీవారికి విన్నపం

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 17**

ఒంగోలు శాసన సభ్యులు టీడీపీ ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ శుక్రవారం ఉదయం తిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పండితులు వేద ఆశీర్వచనం అందించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఆనందంగా కాలం గడిపేలా రాష్ట్రం ప్రగతి పథంలో పయనించేలా చూడాలని శ్రీవారిని ప్రార్థించినట్లు దామచర్ల జనార్ధన్ తెలిపారు.



# చీమకుర్తి హరిహర క్షేత్రంలో ఘనంగా ఆషాడ సారె వేడుకలు

### - శాకాంబరీ దేవి అలంకారం తో దర్శనం ఇచ్చిన శ్రీ వాసవి అమ్మవారు,పార్వతి దేవి అమ్మవారు

### - వాసవి అమ్మవారికి,పార్వతి దేవి అమ్మవారికి గోరింటాకు, సారె, సమర్పించిన శిద్దా లక్ష్మీ పద్మావతి

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూలై 17**

ఆశాడమాసం సందర్భంగా శుక్రవారం చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరిగిన గోరింటాకు పండగ, శాకాంబరీ అలంకారం, వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి,శిద్దా కుటుంబ సభ్యులు నేతృత్వంలో జరిగిన గోరింటాకు పండుగలో అమ్మవారి శాకాంబరీ అలంకార వేడుకలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మర్చిపోయిన మన హిందు పండగ సాంప్రదాయాలను నేటి తరాలకు గుర్తు చేస్తూ లక్ష్మీ పద్మావతి ఈ వేడుకలు వైభవంగా నిర్వహించి హిందు పండగ విశిష్టతను, సంప్రదాయాలను చాటి చెప్పారు.ఆశాడమాసం శుక్రవారం జరిగిన గోరింటాకు పండుగ, శాకాంబరీ అలంకారం, సందర్భంగా చీమకుర్తి, దర్శి మార్కాపురం, ఒంగోలు తదితర ప్రాంతల నుండి మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం శ్రీ హరిహర క్షేత్రంలో వేంచేసివున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకాలు,విశేష కుంకుమ అర్చన విశేష పూల అలంకారాలు నిర్వహించారు. అనంతరం గోరింటాకు తో శ్రీ వాసవి అమ్మవారి అలంకరణ, శాకాంబరీ అలంకారంతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.శాకాంబరీ దేవి అలంకారంతో శ్రీ వాసవి అమ్మవారు,పార్వతి దేవి అమ్మవారు నయన మనోహరంగా భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఆషాఢ సారె వేడుకలు పునస్కరించు కొని చిమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శుక్రవారం జరిగిన శ్రీ వాసవి అమ్మవారి ఆషాడ గోరింటాకు పండగ, శాకాంబరీ అలంకార వేడుకలలో మాజీమంత్రి శిద్దా రాఘవరావు , శిద్దా లక్ష్మీ పద్మావతి దంపతులు క్షేత్రంలో వేంచేసివున్న సర్వ దేవతలకు విశేష పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. వివిధ రకాల, కూరగాయలతో, అమ్మవారికి ఇష్టకరమైన పదార్ధాలతో పాటు శిద్దా లక్ష్మీ పద్మావతి, సువాసినిలతో కలసి గోరింటాకు స్వయంగా రుబ్బి అమ్మవారికి చీర, రవికే, గాజులు, పసుపు,కుంకుమ,పండ్లు 108 రకాల పదార్ధాలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు పంచ మహా



హారతులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వాసవి అమ్మవారి కీర్తనలతో చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో సాక్షాత్తు పెనుగొండ శ్రీ వాసవి అమ్మవారి క్షేత్రం తలపించింది. జై వాసవి నినాదంతో శ్రీ హరిహర క్షేత్రంలో భక్త జనసంద్రంగా మారింది. పల్లపోతు పద్మా ఆధ్వర్యంలో శ్రీ హరిహర క్షేత్రం కోలాటం బృందం నిర్వహించిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. విశేష పూజలు అనంతరం శిద్దా లక్ష్మీ పద్మావతి ముత్తైదువులకు పసుపు కుంకుమ,గాజులు, ప్రసాదాలను అందచేశారు. ఈ వేడుకలలో శిద్దా పాండురంగారావు దంపతులు దంపతులు, శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా పెద్ద బాబు,శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సాయి బాబు దంపతులు, శిద్దా ప్రసాద్, శిద్దా బాలాజీ దంపతులు, శిద్దా జయశ్రీ,శిద్దా పుష్పాలత, శిద్దా జయభారతి, ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలు సువర్ణ, పల్లపోతు పద్మ, అరుణ, ఆర్యవైశ్య వాసవి మహిళా సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాలు, ఉచిత బస్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు శ్రీమాన్ హరి వెంకట కుమారాచార్యులు, సుబ్రహ్మణ్యం శర్మ, హరికృష్ణ శర్మ తదితరులు



భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# గిద్దలూరు రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ నిర్మాణం పనుల్లో తీవ్రజాప్యం

### కంభం రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ జులై 17**

గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు కీలకమైన కంభం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద ఆధునికీకరించేందుకు చేపట్టిన పునర్నిర్మాణ పనుల పూర్తై ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి,దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మేనేజర్ శ్రీమతి సుదర్శనా సేన్ తో కలిసి గౌ. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గిద్దలూరు నియోజకవర్గానికి సంబంధించిన పెండింగ్ రైల్వే సమస్యలను ఎంపీ, రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పలు ప్రధాన డిమాండ్లను రైల్వే అధికారులు , ఎంపీ కి తెలిపారు. గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌కు గిద్దలూరులో హాల్ట్ కల్పించాలి. రేణిగుంట--నంద్యాల రైలును గిద్దలూరు వరకు పొడిగించాలి. గిద్దలూరు--గుంటూరు, గిద్దలూరు--నంద్యాల మధ్య పగటి వేళల్లో కొత్త రైలు సర్వీసులు ప్రారంభించాలిని తెనాలి--మార్కాపురం రోడ్ రైలును గిద్దలూరు లేదా నంద్యాల వరకు పొడిగించాలి. గిద్దలూరు స్టేషన్‌లో కోచ్ పొజిషన్ డిస్‌ప్లే సిస్టమ్ ఏర్పాటు చేయాలి నల్లబండ బజార్--రాచర్ల రోడ్డులో మూసివేసిన రైల్వే గేటును వెంటనే తిరిగి తెరవాలి. దిగువమెట్ట స్టేషన్‌లో ప్రతి రైలుకు తాగునీరు నింపేలా చర్యలు తీసుకోవాలి. గిద్దలూరు మీదుగా చెన్నైకి కొత్త రైలు సర్వీస్ ప్రారంభించాలి. గిద్దలూరు స్టేషన్‌లో ప్రయాణికుల కోసం చెల్లింపు వెయిటింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలి. గిద్దలూరు రైల్వే స్టేషన్ ఆధునీకీకరణ పనులను వేగవంతం చేయాలి. కంభం రైల్వే స్టేషన్ ఆధునీకీకరణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలి. ఈ అన్ని అంశాలపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రైల్వే అధికారులను కోరి నట్లు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులు





**సంతమాగులూరు, పెన్ పవర్, జూలై 17**

సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం అభివృద్ధి, తరగతి గదుల మౌలిక సదుపాయాల మెరుగుదల పనులు పూర్వ విద్యార్థుల అభివృద్ధి కమిటీ, పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా కొనసాగుతున్నాయి. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బ్రహ్మయ్య, రిటైర్డ్ ఎస్సై అట్లా మోహన్ రెడ్డి, రంగస్థల నటుడు అట్లా శ్రీనివాసరెడ్డి, పాఠశాల క్రీడా ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి సమన్వయంతో ఈ పనులు ముందుకు సాగుతున్నాయి. పాఠశాల అభివృద్ధి లక్ష్యంగా పూర్వ విద్యార్థుల నుంచి విరాళాలు సేకరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇప్పటివరకు పూర్వ విద్యార్థుల నుంచి రూ.5,26,214 విరాళాలు సేకరించినట్లు వెల్లడించారు. మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చేకూరి వాసు రెడ్డి, ఈ. రాజశేఖర్ చెరో రూ.50 వేలు విరాళంగా అందించగా, గడ్డం నాగిరెడ్డి రూ.25 వేలు అందించారు. అదేవిధంగా పలువురు పూర్వ విద్యార్థులు రూ.5 వేలు, రూ.10 వేలు, రూ.20 వేల చొప్పున సహకరిస్తుండటంతో నిధుల సమీకరణ వేగంగా జరుగుతోందన్నారు. ఇటీవల బండారు రామకోటయ్య రూ.10 వేలు, గడ్డం భూపాల్ రెడ్డి రూ.10 వేలు విరాళంగా అందించినట్లు తెలిపారు.ఇందులో భాగంగా గిద్దలూరు వాస్తవ్యులు, ఉజ్జయిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. భాస్కర్ రెడ్డి పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. బ్రహ్మయ్య మాస్టర్, అట్లా మోహన్ రెడ్డి, అట్లా శ్రీనివాసరెడ్డి బాల్ బ్యాడ్మింటన్ జట్టు సహచరుడైన భాస్కర్ రెడ్డికి ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి దాతకు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల అభివృద్ధి కమిటీ, పాఠశాల అభివృద్ధి కమిటీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# పలు వార్డుల్లో పారిశుధ్యం పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

### ఇ వి .రమణ బాబు





**గిద్దలూరు పెన్ పవర్ జులై 17**

గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్యం పనులను మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు శుక్రవారం నాడు ఉదయాన్నే పరిశీలించారు. పారిశుధ్యం కార్మికులు రోడ్లమీదికి వచ్చే లోగానే కమీషనర్ రోడ్లపైకి వచ్చి పట్టణంలో పలువార్డుల్లో పర్యటించారు. పట్టణంలోని కశెట్టి వారి వీధి, కుమ్మరి ఆమంకట్ట వీధి గణేష్ నగర్ , కొంగలవీడు రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇదే సందర్బంగా ఆయావీధుల్లో ప్రజలకు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు. నిషేధ ప్లాస్టిక్ క్యారి బ్యాగులను వాడవద్దని అవివాడటం వలన వాతవరణ కాలుష్యం ఏర్పడుతుందని కాకుండా సైడ్ కాలువల్లో వేస్తుండటం తో అవి మురుగు ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని , మనఇండ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులు అందివ్వాలని తెలిపారు. కాకుండా పలువురు ఖాళీ వాటర్ బాటిల్స్ ను , ఇతర చెత్త చెదారాలను సైడ్ కాలువల్లో వేస్తున్నారని ఫలితంగా మురుగు ప్రవాహానికి ఆటంకి ఏర్పడుతుందన్నారు. కాకుండా ప్రతినిత్యం చెత్త సేకరించే కార్మికులు మీ ఇండ్ల వద్దకే వస్తారని వారికే చెత్తను అందివ్వాలని తేలిపారు. లేదా నిర్దేశించిన ప్రాంతాల్లోనే చెత్తను వేయాలని సూచించారు. సైడ్ కాలువల్లో చెత్త , కొబ్బరి బొండాలు , ఖాళీవాటర్ బాటిళ్లు వేస్తున్నారని , ఇది సమంజసం కాదన్నారు. ప్రధానంగా వ్యాపార ప్రాంతాల్లో నిత్యం ఉత్పత్తి అయే వేస్టేజి ని సైడ్ కాలువల్లో వేస్తున్నారని ఎంత కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పుకబడటం లేదన్నారు.పట్టణ మొత్తం లో టన్నులకొద్ది చెత్తను తరలిస్తున్నామన్నారు . పట్టణం సుందరీకరణకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.

# పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

## – వైఎస్సార్ ఆర్ సీపీ నాయకుల డిమాండ్

## – ఒంగోలు కలెక్టరేట్ ముందు వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో రైతుల దీక్ష

*– పాల్గొన్న మాజీ మంత్రులు ఆదిమూలపు సురేశ్, కాకాణి గోవర్ధన్ రెడ్డి, మేరుగ నాగార్జున, జిల్లా పరిషత్ చైర్మన్ వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ వైకాపా ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, నియోజకవర్గ వైకాపా ఇన్చార్జులు*









**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూలై 17**

రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధరల్లేవు పొగాకు రైతుల ధర్నాలు, ర్యాలీలు, నిరసనలు అయినా ఏ మాత్రం పట్టని ప్రభుత్వం వ్యాపారులతో కుమ్మక్కైన ప్రభుత్వ పెద్దలు వేలం పాటకు ముందే వ్యాపారులకు లీకులు ఇస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కూటమి ప్రభుత్వం పై మండిపడ్డారు. శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద పొగాకు రైతులకు సంఘీభావంగా వైఎస్సార్సీపీ నిర్వహించిన భారీ ధర్నా... దీక్ష లో పార్టీకి చెందిన పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం గిట్టని ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఆరోపించారు. జగన్ హయాంలో రైతులకు ఉచిత పంటల బీమా ఇచ్చాం అని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో ఆ భీమా ఊసే లేదని, గిట్టుబాటు ధర కల్పించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఒంగోలు పార్లమెంట్ వైకాపా ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి.. జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రైతుల్ని చంద్రబాబు సర్కార్ గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు ఒక రోజు దీక్ష చేశాం. ప్రకాశం, నెల్లూరు, గోదావరి జిల్లాల్లో పొగాకు పండించిన వారంతా గిట్టుబాటు ధర లేక బోర్డు చుట్టూ తిరుగుతూ, ట్రాక్టర్ ర్యాలీలు చేస్తూ, పొగాకును రోడ్డుపై తగులబెట్టారు. అయినా ఇవన్నీ మీకు కనిపించడం లేదు. గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి రైతులకు అండగా ఉండటం కోసం మార్క్ ఫెడ్ నుంచి రూ.300 కోట్లు ఇచ్చి పొగాకు కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 3-4 వందల కోట్లు వెచ్చించలేరా ? ఒక్క రోజు యోగా కోసం రూ. 300 కోట్లు ఖర్చు పెడతారు కానీ రైతుల కోసం ఖర్చు చేయలేరా ? మీ కేంద్ర ప్రభుత్వానికి చెప్పి పొగాకు రైతుల్ని ఆదుకోలేరా ? మీరు చెప్పిన తర్వాత కూడా కంపెనీలు దిగి రావడం లేదంటే మీరు ఎలా కుమ్మక్కయ్యారో అర్థమవుతోంది. కాబట్టి రైతులకు గిట్టుబాటు ధర వచ్చే వరకూ మేం పోరాటాలు చేస్తూనే ఉంటాం అని హెచ్చరించారు.

రైతు ఆత్మహత్యలు మీకు కనిపించట్లేదా ? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జగన్ తరహాలో మార్క్ ఫెడ్ తో పొగాకు కొనిపించలేరా ? గిట్టుబాటు ధర ఇచ్చే వరకూ పోరాటాలు తప్పవని శివ ప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. పొగాకుకు గిట్టుబాటు ధర కోసం రైతులు రోడ్డెక్కుతున్నా, ర్యాలీలు, ధర్నాలు చేస్తున్నా.. చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నా కూటమి సర్కార్ కు పట్టడం లేదని మాజీ మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయని, ప్రస్తుత పాలకుల వల్ల రైతులు తమ సమస్యలపై మళ్లీ రోడ్ల మీదకు వచ్చి పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రైతులు పండించిన పంటలకు ఎక్కడా కూడా ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. పొగాకు రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండ్తో ఈ నిరసనలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్త బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త చుండూరి రవిబాబు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్బ రెడ్డి




**గిద్దలూరు పెన్ పవర్ జూలై 17**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా, గిద్దలూరు నియోజ కవర్గం కంభం పట్టణంలోని ఉదయగిరి బృందావన ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ సునీత, , జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు , డీఎఫ్ఓ నిషా కుమారి, ఆర్డీఓ ఎం. వెంకట శివరామిరెడ్డి, కంభం ఎస్డీసీ వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వయంగా స్వీకరించారు. ప్రజలు వినిపించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# పేకాట శిబిరం పై పోలీసులు దాడి

## అదుపులోకి ఐదుగురు జూదరులు

## – ఎస్సై నాగ మల్లేశ్వర రావు



**సంతమాగులూరు, పెన్ పవర్, జూలై 17**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు దర్శి డిఎస్పి పి.బాల మురళీకృష్ణ, సంతమాగులూరు సిఐ పి.శేషగిరిరావు పర్యవేక్షణలో సంతమాగులూరు యస్.ఐ వి.నాగమల్లేశ్వరరావుకి రాబడిన సమాచారం మేరకు సంతమాగులూరు యస్.ఐ వి. నాగమల్లేశ్వరరావు తన సిబ్బంది కలిసి ఏల్చూరు గ్రామంలో పేకాట శిబిరం పై దాడి చేశారు. అక్రమంగా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో, శుక్రవారం యస్.ఐ వి. నాగమల్లేశ్వరరావు, తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి చేసి పేకాట ఆడుతున్న 5 మంది వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి మొత్తం రూ. 13,110/- నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కేసు నమోదు చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, ప్రజలు ఇటువంటి చట్టవిరుద్ధ చర్యలకు దూరంగా ఉండాలని, సంతమాగులూరు ఎస్సై పి.నాగమల్లేశ్వరరావు సూచించారు.

## వెలుగొండ ముంపు బాధితులకు మెరుగైన పునరావాస సౌకర్యాలే లక్ష్యం

## – ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ జూలై 17**

గిద్దలూరు నియోజకవర్గం బేస్తవారిపేట మండలం ఒందుట్ల గ్రామంలో వెలుగొండ ప్రాజెక్టు కృష్ణాపురం, లక్ష్మీపురం ముంపు ప్రాంతాల ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్, పి శ్రీనివాసులు జలవనరుల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రోడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, నివాస వసతులు తదితర మౌలిక సదుపాయాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ముంపు బాధిత కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.





## 19న హైదరాబాద్లో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర స్థాయి సమావేశం

**నాగర్కర్నూల్, పెన్ పవర్ జూలై 17**

ఈ నెల 19న హైదరాబాద్ ప్రకాశం హాల్లో జరిగే దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కందనూలు నిరంజన్ కోరారు. శుక్రవారం నాగర్కర్నూల్ దివ్యాంగ భవన్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో దివ్యాంగుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన కీలక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈహెచ్ఎస్ విధి విధానాలు రూపొందిస్తున్న నేపథ్యంలో 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం దివ్యాంగ ఉద్యోగులకు ప్రీమియం చెల్లింపుల నుంచి మినహాయింపు కల్పించాలని కోరనున్నట్లు తెలిపారు. దివ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి గోపాల్, నాయకులు కోటయ్య, శేఖర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**వేల్పుచర్ల, పెన్ పవర్ జూలై 17**

ముసునూరు మండలం, వేల్పుచర్ల గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ -- ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలను మంత్రి స్వయంగా స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే పరిశీలింపజేసి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రతి ఫిర్యాదుపై బాధ్యతతో వ్యవహరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం 22 మంది లబ్దిదారులకు 11 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# బాధితులకు సత్వర న్యాయం చేయాలి...

## పుల్లలచెరువు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఓఎస్డీ నవజ్యోతి మిశ్రా

**పుల్లల చెరువు పెన్ పవర్ జూలై 17**




మార్కాపురం జిల్లా ఓఎస్డీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిశ్రా గురువారం పుల్లలచెరువు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఓఎస్డీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండే విధంగా పోలీసులు పనిచేయాలని సూచించారు. స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ఫిర్యాదులను నిష్పక్షపాతంగా స్వీకరించి చట్టప్రకారం సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందేలా సేవలు అందించడంతో పాటు బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలపై గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించిన ఓఎస్డీ, నేరాల నియంత్రణలో అప్రమత్తంగా ఉండాలని, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు, శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, చట్టబద్ధమైన గడువులో పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ఆయుధాల భద్రత, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించిన ఓఎస్డీ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసింగ్ అందించేందుకు ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఓఎస్డీ సూచనలను అమలు చేస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

# వి బైలులో ఎమ్మెల్యే ఉగ్ర చొరవతో బోరు ఏర్పాటు ప్రారంభించిన నాగిశెట్టి చిన్న మాలకొండయ్య





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 17**

మండలంలోని వి బైలు గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యను గ్రామ ప్రజలు టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ నాగిశెట్టి చిన్న మాలకొండయ్య దృష్టికి తీసుకెళ్లారు వెంటనే స్పందించి కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పంచాయతీ నిధుల ద్వారా కొత్త బోరు ఏర్పాటు చేయించారు ఎమ్మెల్యే చొరవతో శుక్రవారం బోరు బండిని పిలిపించి నాగిశెట్టి చిన్న మాలకొండయ్య చేతుల మీదుగా బోరు పాయింట్ వద్ద టెంకాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి కొత్త బోరు ఏర్పాటు చేయించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందని, గ్రామాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో టిడిపి నాయకులు స్పందించి బోరు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌కు రెఫరీగా విన్సిచ్.. అర్జెంటీనాకు పాత భయాలు.. మెస్సీ అభిమానుల్లో టెన్షన్!

**2026 ప్రపంచకప్ ఫైనల్‌కు రెఫరీగా స్లోవేనియాకు చెందిన స్లావ్కో విన్సిచ్**

**2022లో విన్సిచ్ రెఫరీయింగ్‌లోనే సౌదీ చేతిలో అర్జెంటీనా ఓటమి**

**తాజా నియామకంతో అర్జెంటీనా అభిమానుల్లో నెలకొన్న ఆందోళన**

**స్పెయిన్ ఆడిన కీలక మ్యాచ్‌లలో విన్సిచ్ రెఫరీగా వ్యవహరించి సానుకూల ఫలితాలు**

**ఫైనల్‌లో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై తీవ్ర ఒత్తిడి ఉండే అవకాశం**





**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య జరిగే ఈ టైటిల్ పోరుకు స్లోవేనియాకు చెందిన ప్రముఖ రెఫరీ స్లావ్కో విన్సిచ్‌ను ఫిఫా నియమించింది. ఈ వార్త ఫుట్‌బాల్ ప్రపంచంలో సంతోషం నింపినప్పటికీ, అర్జెంటీనా అభిమానుల్లో మాత్రం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. దీనికి కారణం విన్సిచ్ రెఫరీయింగ్‌లో అర్జెంటీనాకు ఉన్న ఒక చేదు గతం. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు తనను ఎంపిక చేసినట్లు తెలియగానే, రెఫరీ కిట్ అందుకుంటూ విన్సిచ్ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతనికి సహాయకులుగా తోమాజ్ క్లాంక్నిక్, ఆండ్రాజ్ కోవాసిచ్ (ఇద్దరూ స్లోవేనియాకు చెందినవారే) వ్యవహరించనున్నారు.

**అర్జెంటీనాకు ఎందుకు ఆందోళన?**

స్లావ్కో విన్సిచ్ పేరు వినగానే అర్జెంటీనా అభిమానులకు 2022 ఖతార్ ప్రపంచకప్‌లో జరిగిన ఒక ఘోర పరాభవం గుర్తుకొస్తుంది. ఆ టోర్నమెంట్‌లో అర్జెంటీనా ఆడిన తొలి మ్యాచ్ సౌదీ అరేబియాతో జరిగింది. నవంబర్ 22న లుసైల్ స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌కు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఆట ప్రారంభమైన 8వ నిమిషంలోనే అర్జెంటీనాకు పెనాల్టీ ఇవ్వగా, మెస్సీ గోల్ చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ మొత్తం మీద సౌదీ ఆటగాళ్లకు ఆరు ఎల్లో కార్డులు కూడా చూపించాడు. కానీ, చివరికి ఫలితం తారుమారైంది. సెకండాఫ్‌లో సౌదీ అరేబియా సంచలన ప్రదర్శన చేసి 2–1 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచకప్ చరిత్రలోనే అది ఒక పెద్ద షాక్. మెస్సీ జట్టు విన్సిచ్ రెఫరీయింగ్ లో ఓడిపోయిన ఏకైక మ్యాచ్ కూడా ఇదే కావడం గమనార్హం. ఈ పాత జ్ఞాపకాలే ఇప్పుడు అర్జెంటీనా అభిమానులను కలవరపెడుతున్నాయి.

**స్పెయిన్‌కు మాత్రం సానుకూల చరిత్ర**

అర్జెంటీనాకు విన్సిచ్‌తో చేదు అనుభవం ఉంటే, స్పెయిన్‌కు మాత్రం అతనితో సానుకూల రికార్డు ఉంది. యూరోపియన్ టోర్నీలలో స్పెయిన్ ఆడిన అనేక కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా వ్యవహరించాడు. 2017లో కొలంబియాతో స్నేహపూర్వక మ్యాచ్, యూరో 2020లో స్వీడన్‌తో గ్రూప్ మ్యాచ్, 2023లో ఇటలీతో నేషన్స్ లీగ్ సెమీ–ఫైనల్ మ్యాచ్‌లకు అతడు బాధ్యతలు నిర్వర్తించాడు. ముఖ్యంగా యువ సంచలనం లామిన్ యమాల్ జట్టులోకి వచ్చాక, యూరో 2024లో ఇటలీ, ఫ్రాన్స్‌లపై స్పెయిన్ గెలిచిన కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఈ రికార్డు స్పెయిన్ జట్టుకు కొంత ఊరటనిచ్చే అంశం.

**ఈ వరల్డ్‌కప్‌లోనూ వివాదం**

ప్రస్తుత ప్రపంచకప్‌లో కూడా విన్సిచ్ తన కఠిన నిర్ణయాలతో వార్తల్లో నిలిచాడు. మెక్సికో–ఈక్వెడార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈక్వెడార్ ఆటగాడు పీరో హిన్కాపీకి రెడ్ కార్డ్ చూపించాడు. ప్రత్యర్థి ఆటగాడితో మాట్లాడేటప్పుడు నోటికి చేయి అడ్డుపెట్టుకోవడం ఫిఫా నియమావళిని ఉల్లంఘించడమేనని భావించి ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీన్ని బట్టి చూస్తే, అతడు నిబంధనల విషయంలో ఎంత కఠినంగా ఉంటాడో అర్థమవుతుంది. అర్జెంటీనా మ్యాచ్‌లలో రెఫరీ నిర్ణయాలు తరచూ వివాదాస్పదం అవుతున్న నేపథ్యంలో, ఈ ఫైనల్‌లో స్లావ్కో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై ప్రపంచం దృష్టి నిలుస్తుంది. అతనిపై తీవ్ర ఒత్తిడి ఉండటం ఖాయం.

# భారత్‌కు రోహిత్-కోహ్లీ.. ఇంగ్లాండ్‌కు జో రూట్: కుంబ్లే

- రూట్‌ను విరాట్, రోహిత్‌తో పోల్చిన కుంబ్లే
- ఈ ముగ్గురూ ఒత్తిడిలో ఇన్నింగ్స్ నిర్మిస్తారని ప్రశంస
- రూట్ వన్డే శైలిపై ప్రత్యేక వ్యాఖ్యలు
- ముగ్గురూ బంతిని చూసి స్పందిస్తారని వివరణ
- తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లని ఎంచుకుంటారని ప్రశంస



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాకు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఎంత కీలక ఆటగాళ్లో ఇంగ్లండ్‌కు జో రూట్ అంతే కీలకమని మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అన్నాడు. ఒత్తిడిలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే సామర్థ్యం ఈ ముగ్గురిలోనూ ఒకేలా ఉంటుందని చెప్పాడు. కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో రూట్ ఆడిన 99 పరుగుల ఇన్నింగ్స్‌పై స్పందిస్తూ కుంబ్లే ఈ వ్యాఖ్యలు చేశాడు.

234 పరుగుల లక్ష్య ఛేదనలో రూట్ 133 బంతుల్లో 99 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్‌ను చివరి వరకు నడిపించి ఇంగ్లండ్‌కు నాలుగు వికెట్ల విజయాన్ని అందించాడు. అయితే గస్ అట్కిన్సన్ బౌండరీ కొట్టడంతో రూట్ ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ చేసుకున్నాడు.

రూట్ ఇప్పటికీ సంప్రదాయ వన్డే శైలిలోనే బ్యాటింగ్ చేస్తాడని కుంబ్లే పేర్కొన్నాడు. మిగతా ఇంగ్లండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడగా, రూట్ మాత్రం ఓపికగా ఇన్నింగ్స్‌ను నిర్మించాడని చెప్పాడు. స్ట్రైక్‌ను మారుస్తూ, గ్యాప్‌లలోకి బంతిని పంపిస్తూ ఒత్తిడిని తగ్గించడంలో అతను సిద్ధహస్తుడని కొనియాడాడు. అవసరం లేని సమయంలో రిస్క్ షాట్లు ఆడకపోవడమే అతని బలం అని వివరించాడు.ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో పోలిస్తే రూట్ ప్రత్యేకత స్పష్టంగా కనిపించిందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు. పరిస్థితులు సహకరించని పిచ్‌పై కూడా బ్రూక్ టీ20 తరహా షాట్లు ఆడేందుకు ప్రయత్నించాడని, రూట్ మాత్రం వన్డే బ్యాటింగ్‌కు ఆదర్శంగా నిలిచే ఇన్నింగ్స్ ఆడాడని పేర్కొన్నాడు.రూట్, విరాట్, రోహిత్ విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం కూడా ఇదేనని కుంబ్లే చెప్పాడు. ఈ ముగ్గురు ముందే షాట్ నిర్ణయించుకోరని, బంతిని చూసి స్పందిస్తారని వివరించాడు. తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లనే ఎంచుకుంటారని తెలిపాడు. అలాంటి ఆటతీరు జట్టుకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు.

# డోపింగ్ వివాదంలో పాక్ క్రికెటర్ మొహమ్మద్ నవాజ్‌కు భారీ ఊరట.. కానీ ఆ రికార్డులు రద్దు!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్‌కు డోపింగ్ వివాదంలో భారీ ఊరట లభించింది. ఐసీసీ యాంటీ–డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతనిపై విధించిన మూడు నెలల నిషేధం ముగిసింది. ప్రత్యేక చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేయడం ద్వారా అతని శిక్షను ఒక నెలకు తగ్గించడంతో నవాజ్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది.

**ఏమిటీ వివాదం?**

ఈ ఏడాది ఫిబ్రవరి 7న శ్రీలంకలోని కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభ మ్యాచ్ అనంతరం నవాజ్‌కు యాంటీ–డోపింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అతను 'కార్బాక్సీ–టీహెచ్‌సీ' (ఋతీఎశీఞ-ఎ-ఎఎజ) అనే నిషేధిత ఉత్ప్రేరకాన్ని వాడినట్టు పాజిటివ్‌గా తేలింది. కార్బాక్సీ–టీహెచ్‌సీ అనేది గంజాయిలో ఉండే ప్రాథమిక సైకోయాక్టివ్ రసాయనమైన టీహెచ్‌సీ ఉత్పత్తి. మానవ శరీరం గంజాయిని ప్రాసెస్ చేసినప్పుడు, కాలేయం ఈ సమ్మేళనాన్ని నిర్దిష్ట పదార్థంగా మారుస్తుంది. ఇది శరీరంలో ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల, సాధారణ మూత్ర పరీక్షల్లో దీనిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్‌ను గుర్తిస్తారు.

**శిక్ష తగ్గడానికి కారణం**

తాను నిబంధనలను ఉల్లంఘించినట్లు 32 ఏళ్ల నవాజ్ అంగీకరించాడు. అయితే, ఈ పదార్థాన్ని తాను పోటీలకు వెలుపల ఉపయోగించానని, క్రీడా ప్రదర్శనను మెరుగుపరుచుకోవడానికి దీనికి ఎలాంటి సంబంధం లేదని ఐసీసీ ముందు నిరూపించుకోగలిగాడు. దీంతో ఐసీసీ మొదట మూడు నెలల అనర్హత వేటు వేసినప్పటికీ, అతని వివరణతో సంతృప్తి చెందింది. మే 1 నుంచి అతను స్వచ్ఛందంగా తాత్కాలిక సస్పెన్షన్ ప్రారంభించిన తేదీ నుంచి ఈ శిక్షను వర్తింపజేసింది. అంతేకాకుండా ఆమోదిత మాదకద్రవ్యాల దుర్వినియోగ చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేస్తే, శిక్షను ఒక నెలకు తగ్గిస్తున్నట్టు ఐసీసీ వెసులుబాటు కల్పించింది.

నేడు ఐసీసీ విడుదల చేసిన ఒక ప్రకటనలో.. "నవాజ్ తనపై విధించిన శిక్షను అంగీకరించి, చికిత్సా కార్యక్రమానికి కట్టుబడి ఉన్నందున, సుమారు రెండున్నర నెలల సస్పెన్షన్ పూర్తి చేసుకున్న తర్వాత అతని తాత్కాలిక నిషేధాన్ని ఎత్తివేయడం జరిగింది. ఐసీసీ సంతృప్తి మేరకు చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేస్తే, నవాజ్ ఇకపై ఎలాంటి అనర్హత కాలాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేసింది.

# ఓటీటీ మార్కెట్ స్లో అయినా.. చైతూకి ఎందుకింత డిమాండ్?

టాలీవుడ్ లో గత కొంతకాలంగా ఓటీటీ మార్కెట్ జోరు తగ్గిందనే చర్చ సాగుతోంది. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాలకు భారీ మొత్తాలు వెచ్చించిన డిజిటల్ సంస్థలు ఇప్పుడు మాత్రం ఎంపిక చేసిన ప్రాజెక్టులకే పెద్ద మొత్తాలు కేటాయిస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో అక్కినేని నాగ చైతన్య నటిస్తున్న వృషకర్మ సినిమాకు సంబంధించిన నాన్ థియేట్రికల్ బిజినెస్ వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి.



**సున్నితమైన న్యూట్రల్ రంగుల దుస్తుల్లో క్లాసిక్ హుందాతనాన్ని చాటుతున్న కత్రినా కైఫ్**

సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండగానే భారీ డిజిటల్, శాటిలైట్ డీల్ జరిగిందనే ప్రచారం వినిపిస్తోంది. దీంతో ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ స్లోగా ఉన్నా చైతూకి ఎందుకింత డిమాండ్ ఏర్పడిందనే చర్చ మొదలైంది. ఇటీవల నాగ చైతన్య కెరీర్ లో కీలక మలుపుగా నిలిచిన చిత్రం తండేల్. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా చైతన్య మార్కెట్ ను కూడా పెంచిందని చెప్పాలి.



చాలా కాలంగా ఒక పెద్ద కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూసిన చైతూ, తండేల్ తో ఆ లోటును కవర్ చేశారు. ఆ సక్సెస్ ఎఫెక్ట్ ఇప్పుడు ఆయన కొత్త సినిమా వృషకర్మపై కనిపిస్తోందని టాక్ వినిపిస్తోంది. మరోవైపు వృషకర్మ సాధారణ కమర్షియల్ సినిమా కాదు. మిస్టరీ, అడ్వెంచర్, పురాణ అంశాలు, నిధుల అన్వేషణ వంటి అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం నాగ చైతన్యను కొత్త కోణంలో చూపించబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ లో ట్రెజర్ హంటర్ పాత్రలో చైతూ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. గతంలో చేయని రోల్ లో కనిపించబోతుండటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు కార్తీక్ దండు పేరు కూడా ఆ ప్రాజెక్టుకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. విరూపాక్ష వంటి విజయం తర్వాత ఆయన రూపొందిస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకులతో పాటు డిజిటల్ సంస్థల్లోనూ నమ్మకం పెరిగినట్లు తెలుస్తోంది.

ఓటీటీ సంస్థలు ఇప్పుడు కేవలం స్టార్ ఇమేజ్ ను మాత్రమే చూడడం లేదు. థియేటర్ల తర్వాత కూడా ఎక్కువకాలం వీక్షకులను ఆకర్షించే కంటెంట్ కే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆ కోణంలో చూస్తే వృషకర్మలో ఉన్న మిస్టరీ, ఫాంటసీ, థ్రిల్లర్ అంశాలు డిజిటల్ ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. దీంతో చైతన్య సినిమా కోసం ముందుగానే భారీ పెట్టుబడి పెట్టడానికి ఓటీటీ సంస్థలు ఆసక్తి చూపినట్లు సమాచారం.

అలాగే నాగ చైతన్యకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓటీటీ ద్వారా ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు ఉంది. ఇటీవల కాలంలో ఆయన సినిమాలు డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో కూడా మంచి ఆదరణ పొందినట్లు తెలుస్తోంది. ఆ అంశం కూడా వృషకర్మ డీల్ కు కలిసి వచ్చినట్లు చెబుతున్నారు. అలా ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ నెమ్మదించినా, ట్రాక్ రికార్డ్, పెరుగుతున్న మార్కెట్, కొత్త తరహా కథలు ఎంపిక చేసుకోవడం, దర్శకుడిపై ఉన్న నమ్మకం వంటి అంశాలు నాగ చైతన్యకు డిమాండ్ తీసుకొచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే వృషకర్మ విడుదలకు ముందే ఇండస్ట్రీలో ఇంతటి చర్చకు కారణమవుతోందని ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు.



**స్రవంతి చోకరపు ఒక అందమైన జీవిత సందేశాన్ని పంచుకున్నారు**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com